## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

డోర్నకల్, మే 7: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన గొల్లచర్ల, చిల్కోడు మార్గంలో బుధవారం జరిగింది. ఫకీరాతండాకు చెందిన గుగులోత్ సోమ్లా బైక్‌పై వెళ్తుండగా గొల్లచర్ల, చిల్కోడు మార్గ మధ్యలో వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. అతడికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108లో ఖమ్మం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

## అంబేద్కర్ వర్సిటీ ప్రత్యక్ష తరగతులు

మహబూబాబాద్ రూరల్, మే 7 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం ప్రత్యక్ష తరగతులు ఈనెల 10 నుంచి ప్రారంభం కానున్నాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులు హాజరు కావాలని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 7382929705 నంబరును సంప్రదించాలని తెలిపారు.



కాలిపోతున్న గడ్డివాము

## 350మోపుల గడ్డివాము దగ్ధం

నెల్లికుదురు, మే 7: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గడ్డివాము దగ్ధమైన ఘటన మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రానికి చెందిన ఎడ్ల ఆగారెడ్డి తన వ్యవసాయ పొలంలోని 350 గడ్డిమోపులను వ్యవసాయ క్షేత్రంలో వాముగా పెట్టాడు. బుధవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైంది. సుమారుగా రూ.70వేల ఆర్థిక నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు.

## సమయపాలన పాటించాలి

కేసముద్రం, మే 7: పీహెచ్‌సీ వైద్యులు సమయ పాలన పాటించాలని, రోగులకు అందుబాటులో ఉండాలని డీఎం అండ్ హెచ్‌వో రవిరాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేసిన ఆయన రికార్డులు, ఓపీ రిజిష్టర్లను, ఫార్మసీ, హాజరుపట్టికలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రసాద్ ఉన్నారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

నర్సింహులపేట, మే 7: ఆకేరువాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ నాగరాజ బుధవారం తెలిపారు. మండలంలోని రామన్నగూడెం శివారు ఆకేరువాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. రెండు ట్రాక్టర్లు సీజ్ చేసి భద్రత కోసం పోలీస్ స్టేషన్‌లో ఉంచినట్లు తెలిపారు. ఆకేరువాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కాలం చెల్లిన మందుల కలకలం

- వ్యవసాయ బావిలో టాబ్లెట్స్, టానిక్‌లు
- తొర్రూరులోని ఓ మెడికల్ షాపునకు చెందినవిగా గుర్తింపు
- రహస్యంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు



వ్యవసాయబావిలో నీటిపై తేలిన కాలం చెల్లిన మందులు

తొర్రూరు, మే 7: వ్యవసాయ బావిలో కాలం చెల్లిన మందులు, టానిక్‌లు, ఇంజక్షన్లు, బ్యాండేజీలు బుధవారం కనిపించడం కలకలం రేపింది. మండలంలోని అన్నారం రోడ్డులో ఉన్న హచ్చు తండా సమీపంలోని రైతు గుగ్గిళ్ల మహేందర్‌రెడ్డికి చెందిన బావిలో కనిపించగా, విచారణలో అవి తొర్రూరు పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ మెడికల్ షాప్‌నకు సంబంధించినవిగా తేలింది. కాగా, స్థానికంగా ప్రైవేట్ మెడికల్ షాపులకు లైసెన్స్ ఒకరి పేర ఉంటే మరొకరు నిర్వహిస్తున్నారు. మెడికల్ షాపుల్లో ఫార్మసిస్ట్ ఉండటంలేదు. ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందుల విక్రయం, కొన్ని కిరాణా షాపుల్లోనూ మందులు అమ్మకం కొనసాగిస్తున్నారు. కానీ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉష వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా, తొర్రూరు పట్టణంలోని కొన్ని ప్రైవేట్ మెడికల్ షాప్‌ల నిర్వాహకులతో కుమ్మక్కై రహస్యంగా తనిఖీలు చేసి వెళ్లిపోయినట్లు తెలిసింది. ఆమెను వివరణ కోరగా వ్యవసాయ బావిలో కాలం చెల్లిన మందులు లభించాయని, అవి తొర్రూరుకు చెందిన వెంకటరమణ మెడికల్ షాప్‌నకు చెందినవిగా గుర్తించామని పేర్కొన్నారు. కాలం చెల్లిన మందులను ఆ మెడికల్ షాప్ సిబ్బంది డంపింగ్ యార్డ్‌లో వేశారని చెబుతున్నారని, కానీ బావిలోకి ఎలా వచ్చాయో తెలియదని చెప్పారు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని రైతుకు సూచించామని తెలిపారు.



ప్యాడీ క్లీనర్‌కు వేసిన తాళం



గాలికి వడ్లు పట్టుతున్న రాందాస్

## రైతుల మధ్య ప్యాడీ క్లీనర్ చిచ్చు

### ఒకరు తాళం వేస్తే.. సర్వీస్ వైరు తీసుకెళ్లిన మరొకరు

నర్సింహులపేట, మే 7 : ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు తూర్పారా పట్టేందుకు ఏర్పాటు చేసిన ప్యాడీ క్లీనర్ ఇద్దరు రైతుల మధ్య చిచ్చుపెట్టింది. ముందు తనకే కావాలంటే తనకే కావాలంటూ తగాదా పడి దానికి తాళం వేశారు. ఈ ఘటన మండలంలోని ముంగిమడుగు కొనుగోలు కేంద్రంలో మంగళవారం జరిగింది. రైతులు చెప్పిన వివరాల ప్రకారం.. కొనుగోలు కేంద్రంలో వడ్లు పట్టే విషయంలో రైతుల మధ్య గొడవ జరుగడంతో ఓ రైతు తన బైక్‌కు ప్యాడీ క్లీనర్‌కు తాళం వేయడంతోపాటు అది కనిపించకుండా కవర్లు కప్పేశాడు. తానేమీ తక్కువా అని మరో రైతు సర్వీస్ వైరు తీసుకెళ్లడంతో మిగతా రైతులు ఇబ్బందులు పడ్డారు. దీంతో కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఆలస్యంగా ప్యాడీ క్లీనర్ బెల్టు తెప్పించి, వైర్లు బిగించారు. ఇంత జరిగినా ఏపీఎం, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వాన కాలంలో కొనుగోలు కేంద్రంలో బస్తాలు అపహరణకు గురయ్యాయని తెలిపారు. ఇక్కడి ఇబ్బందులు ఎవరికైనా చెప్తే వారి ధాన్యం కాంటా పెట్టడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు గుగులోత్ రాంధన్ మాట్లాడుతూ వడ్లు ఇక్కడ పోసి 25రోజులైందని, మాయిశ్చర్ వచ్చిన తర్వాత వర్షం పడడంతో మళ్లీ మాయిశ్చర్ రావాలని నిర్వాహకులు అంటున్నారని తెలిపారు. వడ్లు పట్టేందుకు ప్యాడీ క్లీనర్ ఇవ్వడంలేన్నారు.

## ధాన్యం బస్తాల తరలింపు

### 'నమస్తే' ఎఫెక్ట్



బస్తాలను లారీలో వేస్తున్న హమాలీలు

పెద్దవంగర, మే 7: మండల కేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలను బుధవారం అధికారులు లారీల్లో తరలించారు. 'మిల్లులకు తరలించరు.. కాంటాలు పెట్టరు' శీర్షికను మంగళవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాంటాలు నిర్వహించి.. ధాన్యం కాంటాలైన తర్వాత మిల్లులకు లారీల్లో తరలించారు. దీంతో రైతులు 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు.

# కొనుగోళ్లలో వేగం పెంచాలి

- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్
- పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తనిఖీలు



నర్సింహులపేట: వంతడపల కొనుగోలు కేంద్రంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

మరిపెడ/ నర్సింహులపేట/ దంతాలపల్లి, మే 7: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. బుధవారం మరిపెడ మండలం అబ్బాయిపాలెం, ఎల్లంపేట, నర్సింహులపేట మండలం వంతడపల శివారులోని కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్లు కాంటా పెట్టారు? ఎన్ని లారీల ధాన్యాన్ని మిల్లులకు తరలించారు? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని, కాంటాల తర్వాత వెంట వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం కొన్న రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వెంటనే డబ్బులు వారి ఖాతాల్లో పడేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. అకాల వర్షాల దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, గన్నీ సంచులు, అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రవాణా చేసేందుకు లారీలు, హమాలీలను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. దంతాలపల్లి మండలం వేములపల్లి, రామవరం గ్రామాల్లో నిర్వహించిన బుధవారం భూ భరతి చట్టం రెవెన్యూ సదస్సులను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం ఇరు గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆర్డీవో గణేశ్, జిల్లా సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, మరిపెడ, దంతాలపల్లి తహసీల్దార్లు సైదులు, సునీల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చాపల యాదగిరిరెడ్డి, నర్సింహులపేట తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో యాకయ్య, సీసీ భీముడు, దంతాలపల్లి తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఆర్ఐ నజీమొద్దీన్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులపై తిరగబడ్డ భూక్యాతండా

- సమస్యలపై నిలదీసిన తండావాసులు
- సీసీ రోడ్డు నిర్మించాలని డిమాండ్
- మదనతుర్తిలో ఇందిరమ్మ ఇళ్లకు అనర్హుల ఎంపికపై ఆగ్రహం



కాంగ్రెస్ నాయకులను నిలదీస్తున్న తండావాసులు

నెల్లికుదురు, మే 7: సమస్యలు పరిష్కరించకపోవడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులపై ప్రజలు తిరగబడుతున్నారు. ఆ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం బ్రాహ్మణకొత్తపల్లి, దుర్గాభవానీ తండా, వస్రాంతండా, మదనతుర్తి గ్రామాల్లో 'జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈమేరకు వస్రాం తండాకు చేరుకున్న నాయకులను భూక్యాతండా వాసులు ప్రశ్నించారు. తమ సమస్యలను ఎందుకు పట్టించుకోవడంలేదని నిలదీశారు. దీంతో వారు ఎలాంటి ప్రసంగం లేకుండానే వెంటనే కార్యక్రమాన్ని ముగించుకుని వెళ్లిపోయారు. అనంతరం తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. తండావాసులు మాట్లాడుతూ వస్రాంతండాలో గుగులోత్ వెంకన్న ఇంటి నుంచి తాళ్లకుంట గండి వరకు సీసీ రోడ్డు నిర్మించాలని పలుమార్లు నాయకులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. వీధి దీపాలు లేక చీకట్లో ఉంటున్నామని, సైడ్ కాల్వ నిర్మాణం, తాగునీటి సమస్యతో నానా అవస్థలు పడుతున్నామని వాపోయారు. తక్షణమే స్పందించి భూక్య తండాకు సీసీ రోడ్డు నిర్మించడంతోపాటు సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గుగులోత్ రమేశ్, రాము, భూక్య వెంకన్న, రెడ్యా, రవీందర్, వీరన్న, యాకేశ్, లాల్‌సింగ్, వీరన్న, బోజ్యా, హరిచంద్రు, బాలాజీ, రమేశ్, రవీందర్, మంగమ్మ, బుజ్జి, మౌనిక పాల్గొన్నారు. కాగా మదనతుర్తిలో ఇందిర్మ ఇండ్లు అర్హులకు మంజూరు చేయకుండా అనర్హులను జాబితాలో చేర్చారని, తమ అనుచరులకు ఇస్తున్నారని పలువురు స్థానిక నాయకులతో వాగ్వాదానికి దిగారు.

## ట్రాక్టర్‌కింద పడి బాలుడు మృతి



పోగుల ఉమేశ్ (ఫైల్)

డోర్నకల్, మే 7: ట్రాక్టర్‌కింద పడి ఓ బాలుడు మృతిచెందిన ఘటన పెరుమాండ్ల సంకీసలో బుధవారం జరిగింది. ఎస్సై గడ్డం ఉమ తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన పోగుల ఉమేశ్(17) ఖమ్మంలో డిప్లొమో సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. బుధవారం ఉమేశ్ తండ్రి నర్సయ్య మరుగుదొడ్డి బేస్‌మెంట్ నిర్మించేందుకు రాళ్లను ట్రాక్టర్‌లో తీసుకొచ్చి ఇంటి వద్ద డౌన్‌కు నిలిపి టైరు కింద రాయి ఉంచాడు. కొద్దిసేపటి తర్వాత ట్రాక్టర్‌ను అన్‌లోడ్ చేసేందుకు ఉమేశ్‌ను టైరు కింద ఉన్న రాయి తొలగించాలని చెప్పగా, తీసే క్రమంలో టైరు అతడి పైనుంచి వెళ్లింది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఖమ్మం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి అన్న గణేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శిగా నాగరాజ్



నాగరాజ్

మహబూబాబాద్ రూరల్, మే 7 : తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన నిమ్మల నాగరాజు నియమితులయ్యారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లల్లు ముదిరాజ్, తెలంగాణ మత్స్య పారిశ్రామిక సంఘం చైర్మన్ సాయి కుమార్ నియమించారు. నాగరాజు ముదిరాజ్ సంఘం అభివృద్ధిలో చురుగ్గా పాల్గొనటం, సంఘంలో క్రియాశీలకంగా పనిచేస్తున్నందున నియమించినట్లు పేర్కొన్నారు.

## నా వడ్లు మిల్లుకు ఎందుకు తరలించరు?

- పెట్రోల్ బాటిల్‌తో రైతు హల్‌చల్
- సముదాయించిన పోలీసులు



పెట్రోల్ బాటిల్‌తో హల్‌చల్ చేస్తున్న రైతు

పెద్దవంగర, మే 7: తన కంటే వెనక్కి వచ్చిన ధాన్యం బస్తాలను తరలిస్తున్నారని, కాంటాలైనా తన బస్తాలను ఎందుకు తరలించరు? అంటూ ఓ రైతు బుధవారం పెట్రోల్ బాటిల్‌తో మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో హల్‌చల్ చేశాడు. మండలంలోని సోమ్లా తండాకు చెందిన బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ఈరోజు అధికారులు లారీలు పంపించగా తన వెనుక కాంటాలైన రైతుల బస్తాలను లారీల్లో తరలించి తన బస్తాలను ఆపారు. ఎందుకని అడిగితే దొడ్డు ధాన్యాన్ని మాత్రమే లారీ యాజమాన్యాలు, మిల్లు వాళ్లు తీసుకెళ్తున్నారని చెప్పారు. తన ధాన్యాన్ని తీసుకెళ్లకపోవడంతో మనస్తాపంతో పెట్రోల్ బాటిల్ తీసుకొచ్చానన్నారు. సన్న ధాన్యాన్ని తీసుకెళ్లడంలో జాప్యం చేస్తున్నారని తెలిపారు. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రైతును సముదాయించి రేపు ధాన్యం బస్తాలను తరలించేలా లారీలను పంపిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించాడు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మాలతి

## సేంద్రియ విధానంలో సాగుచేయాలి

గూడూరు, మే 7: రైతులు సేంద్రియ విధానంలో వ్యవసాయం చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని కేవీకే మల్యాల సమన్వయ కర్త డాక్టర్ ఎస్.మాలతి, జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వడ్డెరగూడెం రైతు వేదిక వద్ద రైతులకు వ్యవసాయంలో నూతన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాలతి మాట్లాడుతూ వ్యవసాయంలో పంటమార్పిడి విధానం, నీటిని పొదుపుగా వాడడం, నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని వ్యవసాయం చేసుకోవాలని, విత్తనాలను తీసుకునే సమయంలో రశీదులు తీసుకోవాలని తెలిపారు. పచ్చిరొట్ట సాగు చేయాలని, మట్టి పరీక్షలు చేయించుకోవాలని, జీవన ఎరువులు వాడుకోవాలని, వాతావరణ పరిస్థితులను అంచనా వేసుకోవాలని, పత్తి, మిర్చి, కూరగాయల సాగుచేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. డీహెచ్ఎస్‌వో మరియన్న, ఏడీఏ శ్రీనివాస్‌రావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు క్రాంతికుమార్, రాంబాబు, ఏఎవో అబ్దుల్ మాలిక్, ఏఈవోలు అలేఖ్య, మధు, వినయ్, సుష్మిత పాల్గొన్నారు.

## మిజోరామ్ గవర్నర్‌ను కలిసిన పర్వతారోహకుడు



మరిపెడ, మే 7: తెలంగాణకు చెందిన పర్వతారోహకుడు భూక్య యశ్వంత్ బుధవారం మిజోరామ్ గవర్నర్ విజయ్‌కుమార్ సింగ్‌ను కలిశారు. గవర్నర్ హర్ శిఖర్ పార్ తిరంగా కోసం యశ్వంత్ నిరంతరం ఆసక్తిని కనబరుస్తున్నట్లు తెలిపారు.

## చెరువుకట్ట మరమ్మతు చేయాలి



ఇరిగేషన్ డీఈకి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

చిన్నగూడూరు, మే 7: వర్షాకాలంలో భారీ వర్షాలు, వరదలకు తెగిన మండలంలోని గుండంరాజుపల్లి చెరువుకట్ట మరమ్మతు చేయాలని ఇరిగేషన్ డీఈ పొట్టయ్యకు బుధవారం గ్రామ రైతులు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ మరో నెల రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరారు. గ్రామ రైతులు చెక్కల శ్రీనివాస్, మూల శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, ఇటోబా, సోమనర్సయ్య, మల్లయ్య, వెంకటేశ్, శ్రీను ఉన్నారు.

# 'ఇందిరమ్మ ఇళ్ల'పై రీ సర్వే చేయాలి

నెల్లికుదురు/కురవి, మే 7: మండలంలోని రాజుకొత్తపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో అక్రమాలు జరిగాయని, రీ సర్వే చేయాలని సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు వరిపల్లి అనిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, ఎండీ వీపీ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకానికి అర్హులను ఎంపిక చేయకుండా, కాంగ్రెస్ పార్టీలోనే ఇరువర్గాల వారు తమ అనుచరులతో జాబితా సిద్ధం చేశారని, అధికారులు తుది జాబితా వెల్లడించకుండా గోప్యంగా ఉంచుతున్నారని ఆరోపించారు. మళ్లీ సర్వే చేసి అర్హులను ఎంపిక చేయాలని కోరారు. కాగా, కురవి మండలంలో ఇటీవల వీచిన గాలిదుమారం, కురిసిన భారీ వర్షాలకు కూలిన ఇళ్ల బాధితులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాలోత్ కిషన్‌నాయక్ కోరారు. బుధవారం మండలంలోని బలపాల, ఇతర గ్రామాల్లో బాధితుల ఇళ్లను పరిశీలించారు. బానోత్ దేవానాయక్, రాజునాయక్, వెంకన్ననాయక్, సీతారాంనాయక్ పాల్గొన్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

### అర్హులకు మంజూరు చేయాలి

మరిపెడ: ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు మంజూరు చేయాని మండలంలోని వెంకంపాడు గ్రామస్తులు బుధవారం ఎంపీడీవో విజయకు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు కమిటీ సభ్యుడు గోగుల మల్లేశ్ ఇళ్లను తనకు అనుకూలమైన వారికి కేటాయిస్తున్నారని ఆరోపించారు. తాను చెప్పినట్టే చేయాలని అధికారులు హుకుం జారీ చేస్తున్నాడని, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అని, ఎమ్మెల్యే పేరు చెప్పి బెదిరిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. తప్పెట్ల వెంకన్న, తప్పెట్ల విజయ్, తప్పెట్ల అర్జున్, తప్పెట్ల ఎల్లయ్య, తప్పెట్ల గాంధీ, తప్పెట్ల మల్లయ్య పాల్గొన్నారు.

# బీసీల పోరాట ఫలితమే కులగణన నిర్ణయం



మాట్లాడుతున్న కులసంఘాల ప్రతినిధులు

కురవి, మే 7: బీసీల పోరాట ఫలితంగానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుల గణన చేపట్టనుందని కులగణన సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ తెలిపారు. మండలంలోని నేరడ గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల లెక్కలు తేల్చాలనే డిమాండ్‌తో ప్రధానికి కోటి ఉత్తరాల కార్యక్రమాన్ని నేరేడ గ్రామంలో మూడేళ్ల క్రితం తొలిసారి ప్రారంభించినట్లు గుర్తుచేశారు. ఆ తర్వాత ఇతర రాష్ట్రాలతోపాటు ఢిల్లీ వరకు ఉద్యమాన్ని తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేస్తూ ఉత్తరాలు రాయిస్తూ, 40లక్షల ఉత్తరాలను చేరవేశామని తెలిపారు. ఆ సమితి మానుకోట జిల్లా కన్వీనర్ కొండబత్తుల యాదగిరి, కొల్లూరి కృష్ణయ్య, గంధసిరి ఉప్పలయ్య, కేదాసు మనస్విని, గుంజే హనుమంతు వడ్డెర, ముల్క కృష్ణమూర్తి పద్మశాలి, నవీన్ గౌడ్, శోభారాణి, షేక్ మీరాసాహెబ్, దుగ్గి రవి, గొల్లగోపు నాగరాజు, రమేశ్, నున్న సుమన్, ఆకుల శ్రీనివాస్, భద్రునాయక్, కందగట్ల రవీందర్, నరేశ్, రమేశ్, వెంకన్న పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య

### పోస్టర్ ఆవిష్కరించిన తహసీల్దార్ మహేందర్



అధ్యాపకులతో పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

పెద్దవంగర, మే 7: ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులకు కార్పొరేట్‌కు దీటుగా విద్యనందిస్తున్నట్లు తహసీల్దార్ వీ మహేందర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, తొర్రూ రు అధ్యాపక బృందంతో కలిసి పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరేలా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ గ్రూపులు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుందని, విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నారాయణ, అధ్యాపకులు సువర్ణ, అన్నపూర్ణ, మల్లయ్య, ఉప్పలయ్య, నర్సయ్య, శివరామకృష్ణ, రాజేశ్‌కుమార్, నాగరాజ్, కుల్దీప్ పాల్గొన్నారు.

## కలెక్టర్, డీఈవోకు ఘనసన్మానం

మహబూబాబాద్ రూరల్, మే 7 : పదో తరగతి ఫలితాల్లో మహబూబాబాద్ జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపినందుకు కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డిని బుధవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు పుష్పగుచ్ఛాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లోనూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, యువతను సన్మార్గంలో నడిచేలా దిశానిర్దేశం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, మార్నేని వెంకన్న, శంకర్, మార్నేని రఘు పాల్గొన్నారు.



కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, డీఈవో రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

## సమాజసేవలో భాగస్వాములు కావాలి




మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఉమారెడ్డి

ఇనుగుర్తి, మే 7: ప్రతి ఒక్కరూ సమాజసేవలో భాగస్వాములు కావాలని వరంగల్ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ ఉమారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో వరంగల్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు సమాజసేవలో భాగస్వాములు కావాలని, కష్టం విలువ తెలుసుకోవాలని ప్రొఫెసర్‌లు అన్నారు. మండల కేంద్రంలోని సంతలో ప్లాస్టిక్ నిర్మూలించాలని ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, గోపిక పాల్గొన్నారు.

## ఉగ్రవాదంపై పోరాటం చేయాలి

మహబూబాబాద్ రూరల్, మే 7 : ఉగ్రవాదంపై ఐక్యంగా పోరాటం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్‌సారథి అన్నారు. బుధవారం పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా జాతీయ పతాకంతో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత సైన్యానికి రెడ్ సెల్యూట్ అని, దేశ సమగ్రత సమైక్యతే ప్రధానంగా సైనికులు ముందుకు సాగాలన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషించటం వల్ల ఈ దుస్థితి వచ్చిందన్నారు. కార్యక్రమంలో బీ అజయ్‌సారథి, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, పాండురంగచారి, వెంకన్న, అశోక్, శంకర్, శ్రావణ్ పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి

మహబూబాబాద్ రూరల్/ కురవి, మే 7 : విద్యుత్ శాఖ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఎస్ఈ) నరేష్ అన్నారు. విద్యుత్ భద్రత వారోత్సవాల్లో బుధవారం పట్టణంలోని ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భద్రత పరికరాలు తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. విద్యుత్ భద్రత నియమాలపై ప్రతిజ్ఞ చేయించారు. డీఈ విజయ్, ఏడీఏ ప్రశాంత్, ఏఈలు వెంకటేశ్వర్లు, సంగీత, నవ్య, లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, కురవి మండల కేంద్రంలోని ఓం ఫంక్షన్‌హాల్‌లో బుధవారం విద్యుత్ భద్రతావారోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. టెక్నికల్ డీఈ పెద్దిరాజు, డీఈ విజయ్ ముఖ్య అతిథిలుగా పాల్గొని మాట్లాడారు. రైతులు వ్యవసాయ పంపుసెట్లను వినియోగించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏడీఈ రమేశ్, ఏఈలు సునీల్, శారద, సుమన్, మహేందర్‌బాబు, కిరణ్, విద్యుత్ సిబ్బంది జంపీరావు, వెంకటేష్, సిద్ధు, రాజు పాల్గొన్నారు.

## 'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయాలి

నెల్లికుదురు, మే 7: రైతాంగ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) ఆధ్వర్యంలో ఈనెల 8న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐయూకేఎస్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి జక్కుల యాకయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని మేచరాజుపల్లిలో బుధవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. రైతులకు గిట్టుబాటు ధరలను కల్పించడం, నాణ్యమైన ఎరువులను అందించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, వ్యవసాయ తదితర అనుబంధ రంగాలకు సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం డివిజన్ నాయకులు కేశవులు, రవీందర్, సాయిలు, వీరన్న, సోమయ్య పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

మహబూబాబాద్ రూరల్, మే 7 : నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని ఈనెల 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్ అన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ హక్కులను హరిస్తోందని, కార్మికులకు 8గంటల పని విధానానికి బదులుగా 12 గంటలు పెంచిందన్నారు. కార్మికులు సమ్మెను విజయవంతం చేయాలన్నారు. విజయ్, శ్రీనివాస్, సహదేవ్, మోహన్, రాజు పాల్గొన్నారు.



విద్యుత్ భద్రత నియమాలపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఈ నరేష్

## మావోయిస్టులతో చర్చలు జరపాలి

కొత్తగూడ, మే 7: కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని, ఆదివాసీలను హననం చేసే ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి బూర్క బుచ్చిరాములు, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లెల రాము, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మునబోయిన వేణు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కర్రెగుట్ట చుట్టూ మోహరించిన కేంద్ర బలగాలను వెనక్కి పంపించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఇడంపాక శ్రీశైలం, గజ్జి సోమన్న, యాదగిరి, యుగేందర్, పసునూరి రాజమల్లు, తాళ్లపెల్లి ప్రభాకర్, ఈసం రామస్వామి, ఈక రవి, పూనెం సందీప్, మల్లెల సారయ్య, బానోత్ నెహ్రూ, భూపతి తిరుపతి, హస్తం ఎల్లయ్య, పిడబోయిన వీరస్వామి పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

గార్ల, మే 7: ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలన్నారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న మావోయిస్టులను చంపడం అన్యాయమన్నారు. కందునూరి శ్రీనివాస్, అలవాల సత్యవతి, జంపాల వెంకన్న, వంగూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

సెప్టిక్ ట్యాంక్ క్లినర్
SepTeK
★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043, 9866584455.
NTW-337056

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565